సాక్షి
మంచిర్యాల

శనివారం । 25 । నవంబర్ । 2023



ఇంటి వద్దనే ఓటేశారు

జిల్లాలోని పలు మండలాల్లో ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వయోవృద్ధులు, దివ్యాంగులు శుక్రవారం ఇంటి వద్దనే ఓటు వేశారు. 9లో ▸



గూడెంలో భక్తుల రద్దీ

దండేపల్లి: కార్తీక మాసం సందర్భంగా గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శుక్రవారం అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవుణ్ని దర్శించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0 /22.0

ఆకాశం ఉదయం వేళ మేఘావృతమై ఉంటుంది. ఈశాన్యం దిశగా చలిగాలులు వీస్తాయి. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా ఈవీఎంల కమీషనింగ్



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల సందర్భంగా ఈ నెల 30న జరిగే పోలింగ్ కోసం ఈవీఎంల కమీషనింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బీ.సంతోష్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో రిటర్నింగ్ అధికారి రాములుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో రెండవ రోజు శుక్రవారం బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ల కమీషనింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

30న పోలింగ్ డే సెలవు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బీ.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు జరిగే మూడు నియోజకవర్గాల పరిధిలో సెలవు ప్రకటించామని, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన కార్యాలయాలు, కళాశాలలు, విద్యాసంస్థలకు ఈ నెల 29, 30న సెలవు ఉంటుందని తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్ దత్తా



పరిశీలిస్తున్న బిశ్వజిత్ దత్తా

మంచిర్యాలఅగ్రికల్చర్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఈ ఎన్నికల్లో 80 ఏళ్లు పై బడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే హోమ్ ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్ దత్తా అన్నారు. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని నస్పూర్‌లో హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల వద్ద జరుగుతున్న ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ అత్యవసర సేవలు, ఎన్నికల సిబ్బంది, అధికారులు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించినట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి



దివ్యాంగుడితో మాట్లాడుతున్న కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఓటు హక్కు వచ్చిన ప్రతి ఒక్కరూ ఈ ఎన్నికల్లో ఓటు వేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బీ.సంతోష్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను రిటర్నింగ్ అధికారి రాములుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, గర్భిణుల కోసం ర్యాంపు, వీల్‌చైర్ల సదుపాయం కల్పించామని పేర్కొన్నారు. నూతనంగా నమోదైన ఓటర్లకు గుర్తింపు కార్డులను తపాలా శాఖ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడలో హోమ్ ఓటింగ్ వినియోగంపై పరిశీలించారు.

ఈవీఎం సెంటర్ పరిశీలించిన కలెక్టర్

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవీఎంల కమీషనింగ్‌ను కలెక్టర్ బీ.సంతోష్, నియోజకవర్గ పరిశీలకులు సజ్జన్ ఆర్ శుక్రవారం పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ల కమీషనింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఈవీఎంలకు బ్యాలెట్ పేపర్ల అమరిక ఎలా జరుగుతుందో పనితీరును పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆర్‌వో సిడాం దత్తు, తహసీల్దార్ మల్లిఖార్జున్, ఎన్నికల డీటీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గోదావరికి కరకట్ట నిర్మిస్తాం..

- కాంగ్రెస్ గెలిస్తే వాడకో పేకాట క్లబ్
- ముఖ్యమంత్రి కేసీఆర్
- కాంగ్రెస్ అభ్యర్థిపై విమర్శలు
- సింగరేణి సమస్యలపై ప్రస్తావన
- సభ విజయవంతంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్, పక్కన దివాకర్‌రావు, బహిరంగ సభకు హాజరైన ప్రజలు

శ్రీరాంపూర్/నస్పూర్: మంచిర్యాల పట్టణానికి వరదలు రాకుండా చుట్టూ కరకట్ట నిర్మిస్తామని, అవసరమైతే వచ్చే వేసవిలోనే ఈ పనులు చేయిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీనిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంచిర్యాల జిల్లా నస్పూర్ కలెక్టరేట్ సమీపంలోని మైదానంలో శుక్రవారం మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే వాడకో పేకాట క్లబ్ మొదలవుతుందని, ఇక జనాలు ఇళ్లు అమ్ముకుని పేకాట ఆడుతారని విమర్శించారు. సింగరేణి 134ఏళ్ల క్రితమే నిజాం చేతిలో ఉండేదని, తర్వాత వంద శాతం ఇది రాష్ట్ర సంస్థగా ఉంటే కేంద్రం వద్ద తెచ్చిన అప్పులు తీర్చక కాంగ్రెస్ పార్టీ 49శాతం వాటాను అప్పగించిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీలు, ఇంటెక్, ఐటెక్ సంఘాలు ఉన్న వారసత్వ ఉద్యోగాలు పోగొడితే తిరిగి తాను ఇప్పించానని తెలిపారు. నేడు 15వేల మందికి కారుణ్య ఉద్యోగాలు కల్పించామని, ఉద్యోగం వద్దనుకుంటే రూ.25లక్షల మొత్తాన్ని కూడా చెల్లిస్తున్నామని అన్నారు. సింగరేణి కార్మికులకు ఆదాయపన్ను మాఫీ చేయాలని మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే తాము తీర్మానం చేసి మోదీకి పంపించామని, ఆయన ఏ మాత్రం పట్టించుకోలేదని చెప్పారు. చివరికి ఆదానీ కోసం ఆస్ట్రేలియా బొగ్గు కొనాలని ఒత్తిడి తెస్తున్నారని మండిపడ్డారు. లాభాల వాటాను 32శాతానికి పెంచామని, దీంతో ఇటీవల దసరా, లాభాల బోనస్ అన్ని కలిపి సుమారు రూ.2లక్షలకు పైగా వచ్చాయని గుర్తు చేశారు. సకల జనుల సమ్మెలో సింగరేణి కార్మికుల పోరాట పటిమను కూడా కేసీఆర్ ప్రస్తావించారు.

పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం

హోరాహోరీగా సాగుతున్న ఎన్నికల ప్రచారంలో గులాబీ బాస్ పర్యటన మంచిర్యాల నియోజకవర్గం శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపింది. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరు కావడంతో ప్రజాఆశీర్వాద సభ గులాబీ ప్రభంజనాన్ని సృష్టించింది. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఉదయం 11గంటలకే సభ జరగాల్సి ఉండగా రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. వాతావరణం మబ్బుగా ఉండి చిరుజల్లులు పడడంతో సభ రద్దవుతుందేమోనని నాయకులు ఆందోళన చెందారు. చివరికి ఆలస్యమైనా సరే కేసీఆర్ సభకు వస్తారని పార్టీ అధిష్టానం నుంచి నుంచి ఆదేశాలు రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. సభకు పెద్దయెత్తున జనాలు తరలిరావడంతో సంతోషం వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికులు కూడా అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఎన్నికల సమయం కావడంతో మండల స్థాయి నుంచి మొదలుకొని పెద్ద సంఖ్యలో నేతలను వేదికపై కూర్చోబెట్టారు. కాగా, జిల్లాలో ఇప్పటికే బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల పరిధిలో ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు గడ్డం అరవిందరెడ్డి, బోడ జనార్దన్, మధుసూదనచారి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ.వెంకట్రావు, డీసీఎంఎస్ చైర్మన్ లింగన్న, బీఆర్ఎస్ నేత విజిత్‌రావు, నస్పూర్, మంచిర్యాల, లక్సెట్టిపేట మున్సిపల్ చైర్మన్‌లు ఈసంపల్లి ప్రభాకర్, పెంట రాజయ్య, నల్మాస్ కాంతయ్య, పార్టీ మండల అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ భూమేశ్, నాయకులు వంగ తిరుపతి, సంతోషచారి, సుదమల్ల హరికృష్ణ, డీ.అన్నయ్య, ఏనుగు రవీందర్‌రెడ్డి, గోగుల రవీందర్‌రెడ్డి, పల్లపు తిరుపతి, హైమద్, అత్తి సరోజ, రౌతు రజిత, బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.

దివాకర్‌రావు వ్యక్తిత్వాన్ని కొనియాడిన కేసీఆర్

సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో దివాకర్‌రావు వ్యక్తిత్వాన్ని కొనియాడారు. దివాకర్‌రావు చాలా మంచివాడని, నిజాయతీ పరుడని, ఎప్పుడు తనకు వద్దకు స్వంత పనుల కోసం రాలేదని, నియోజకవర్గానికి అది కావాలి, ఇది కావాలి అంటూ అభివృద్ధి పనుల కోసమే వచ్చేవారని తెలిపారు. 24 గంటల కరెంటు కావాలంటే దివాకర్‌రావును గెలిపించాలని అన్నారు. కత్తి ఒకరికి ఇచ్చి యుద్ధం ఒకరిని చేయమంటే ఎట్లా అని కేసీఆర్ చెప్పడంతో సభికుల నుంచి పెద్దయెత్తున హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. తన ప్రసంగంలో మాజీ ఎమ్మెల్యే అరవింద రెడ్డి, బోడ జనార్దన్ పేర్లు ప్రస్తావించి వారి వర్గీయుల్లో ఉత్తేజాన్ని నింపారు.



సీఎంకు విజిత్‌రావు, దివాకర్‌రావు స్వాగతం



సభా వేదికపై పాటకు అనుగుణంగా నృత్యం చేస్తున్న నాయకులు, మహిళలు

ఐటీ హబ్ ఏర్పాటు చేయాలి

- బీఆర్ఎస్ అభ్యర్థి దివాకర్‌రావు



మాట్లాడుతున్న దివాకర్‌రావు

మంచిర్యాల నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులకు నిధులివ్వాలని బీఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు కేసీఆర్‌ను కోరారు. మంచిర్యాల, నస్పూర్ పట్టణాల్లోని పలు ప్రాంతాల్లో గోదావరి వరదలు వచ్చాయని, అధికారంలోకి వచ్చాక శాశ్వత పరిష్కారానికి కరకట్ట నిర్మించాలని కోరారు. మంచిర్యాలప్లై ఓవర్ బ్రిడ్జి మరింత వెడల్పు చేయాలని, ఐటీ హబ్, ఇంజినీరింగ్ కాలేజీ, ఎల్లంపల్లి వద్ద టూరిజం పార్క్, ఆటోనగర్ ఏర్పాటు చేయాలని అన్నారు. రూ.164 కోట్లతో మంచిర్యాల–అంతర్గాం బ్రిడ్జి నిర్మాణం, మెడికల్ కాలేజీ, గూడెం లిఫ్ట్ ఇరిగేషన్, సింగరేణి స్థలాల్లో 3500 మందికి ఇళ్ల పట్టాలు, సింగరేణి కార్మికులకు కారుణ్య ఉద్యోగాలు ఇప్పించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని అన్నారు. మిగతా వారికి కూడా సింగరేణి పటా లు ఇప్పించాలని కోరారు. బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగనామం పెట్టి ఆ డబ్బులతో ఓట్లు కొనాలని చూస్తున్న వారికి ప్రజలు గుణపాఠం చెప్పాలని ప్రేంసాగర్‌రావును ఉద్దేశించి విమర్శించారు. అభ్యర్థి గుణగణాలను చూసి ఓటెయ్యాలని, అభివృద్ధిలో తెలంగాణ దేశానికి దిక్సూచీగా ఉండాలంటే మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలన్నారు.

ఓటింగ్‌పై 'ప్రత్యేక' దృష్టి

- జిల్లాలో మోడల్ పోలింగ్ కేంద్రాలు
- దివ్యాంగులు, మహిళలు, యువత కోసం ఏర్పాటు



లక్సెట్టిపేటలోని ఎంపీపీఎస్ పోలింగ్ కేంద్రం

మంచిర్యాలటౌన్: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటే వేసేలా ఎన్నికల సంఘం వినూత్న పద్ధతులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఓటింగ్ పెంచేలా కళాజాత ప్రదర్శనలు, ఐకేపీ, మెప్మా మహిళా సంఘాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పోలింగ్ కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతోంది. ఓటర్లను ఆకర్షించేలా ప్రతీ నియోజకవర్గానికి దివ్యాంగుల, యూత్ పోలింగ్ కేంద్రాలు ఒక్కొక్కటి, మహిళా పోలింగ్ కేంద్రాలు, మోడల్ పోలింగ్ కేంద్రాలు ఐదు చొప్పున ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

సదుపాయాలు ఇలా..

సాధారణ పోలింగ్ కేంద్రాలతో పోల్చితే మోడల్ పోలింగ్ కేంద్రాలను అందంగా అలంకరించి తగిన సౌకర్యాలు కల్పిస్తారు. పోలింగ్ కేంద్రాలను పోలింగ్‌కు ఒక రోజు ముందే పూలు, మామిడి తోరణాలు, వివిధ రకాల వస్తువులతో అలంకరిస్తారు. ఓటరు వచ్చేసరికి అందంగా తీర్చిదిద్దుతారు. మరుగుదొడ్డి, మూత్రశాలలు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటారు. ప్రత్యేకంగా రెడ్ కార్పెట్ పరిచి ఓటర్లకు స్వాగతం పలుకుతూ కనువిందు కలిగిస్తారు. ఓటరు ప్రత్యేక అనుభూతిని పొంది మిగతా ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు సహకరిస్తారని ఎన్నికల సంఘం భావిస్తోంది.

మహిళా సిబ్బందే..

మహిళా పోలింగ్ కేంద్రాల్లో మొత్తం మహిళా సిబ్బందే ఎన్నికల విధులు నిర్వర్తిస్తారు. ఎన్నికల సిబ్బంది, పోలీసు, పర్యవేక్షణ, భద్రత అధికారులు ఇలా అందరూ మహిళలే ఉంటారు.

- దివ్యాంగుల పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులైన ఎన్నికల సిబ్బంది, యువత పోలింగ్ కేంద్రాల్లో మొ త్తం యువ పోలీసులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ది వ్యాంగ ఓటర్లకు వీల్‌చైర్లు అందుబాటులో ఉంచుతారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి: బెల్లంపల్లి నియోజకవర్గంలో 227 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ఇందులో ఐదు మోడల్, మరో ఐదు మహిళా పోలింగ్ కేంద్రాలు, దివ్యాంగులు, యువత కోసం ఒక్కో పోలింగ్ కేంద్రం గుర్తించారు. మహిళల కోసం కాసిపేటలోని 31 పోలింగ్ కేంద్రం, ఎంపీపీఎస్ కాసిరెడ్డిపల్లి(పీఎస్ నం.79), ఎంపీపీఎస్ గోపాల్‌నగర్(పీఎస్ నం.130), ఎంపీపీఎస్ కన్నెపల్లి మండలం రెబ్బెన(పీఎస్ నం.153), జెడ్పీ హైస్కూల్ భీమిని(పీఎస్ నం.175) ఏర్పాటు చేశారు. యువత కోసం బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల(పీఎస్ నం.63) గుర్తించారు.

- దివ్యాంగుల కోసం బెల్లంపల్లి బజారు ఏరియా ఉన్నత పాఠశాలలో పీడబ్ల్యూడీ(పీఎస్ నం.99) పోలింగ్ కేంద్రాన్ని గుర్తించారు.
- ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వీటిలో తాండూర్ మండలం రేపల్లెవాడ ఎంపీయూపీఎస్(పీఎస్ నం.138), భీమిని మండలం మెట్టుపల్లి ఎంపీయూపీఎస్(పీఎస్ నం.172), కన్నెపల్లి మండలం ముత్తాపూర్ గ్రామంలోని ఎంపీపీఎస్(పీఎస్ నం.154), వేమనపల్లి మండలం నీల్వాయిలోని జెడ్పీహెచ్ఎస్(పీఎస్ నం.197), నెన్నెల మండలం గొల్లపల్లి గ్రామం(పీఎస్ నం.212) పోలింగ్ కేంద్రం ఉన్నాయి.

చెన్నూర్‌లో..


చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో 227 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఐదు ఆదర్శ పోలింగ్ కేంద్రాలుగా మందమర్రి మండలం మైన్స్ వొకేషనల్ ట్రైనింగ్ సెంటర్(పీఎస్ నం.40), జైపూర్ మండలం పెగడపల్లి(పీఎస్ నం.98), భీమారం మండలం పొలంపల్లి(పీఎస్ నం.127), కోటపల్లి మండలం మల్లంపేట(పీఎస్ నం.202) గుర్తించారు.

మంచిర్యాలలో..

మంచిర్యాల నియోజకవర్గంలో 287 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ఐదు మహిళా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి ఏర్పాటు చేస్తున్నారు. మంచిర్యాల జెడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాల(పీఎస్ నం.144), నస్పూర్‌లోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్(పీఎస్ నం.235), జెడ్పీఎస్ఎస్ దండేపల్లి(పీఎస్ నం.46), జెడ్పీఎస్ఎస్ దొనబండ, హాజీపూర్ మండలం (పీఎస్ నం.98), ఎంపీపీఎస్ లక్సెట్టిపేట(పీఎస్ నం.82) మహిళా పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు.

- దివ్యాంగులు ఎక్కువగా ఉన్న ప్రాంతంలోని మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పీఎస్ నం.179)ను దివ్యాంగుల పోలింగ్ కేంద్రంగా గుర్తించారు.
- యువతను ఆకర్షించేలా నియోజకవర్గంలోని ఎంపీపీఎస్ బోయవాడ లక్సెట్టిపేట(పీఎస్ నం.83) గుర్తించారు. వీటితోపాటు నియోజకవర్గంలో ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. అందులో మంచిర్యాలలోని కేంద్రియ విద్యాలయం(పీఎస్ నం.156), నస్పూరులోని సింగరేణి హైస్కూల్ (పీఎస్ నం.244), దండేపల్లి మండలం ఎంపీపీఎస్ పెద్దపేట్(పీఎస్ నం.17), హాజీపూర్ మండలం ముల్కల్ల జెడ్పీఎస్ఎస్(పీఎస్ నం.126), లక్సెట్టిపేట మండలం గుల్లకోట యూపీఎస్(పీఎస్ నం.94) లను గుర్తించారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు..



ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న వినూత్న కార్యక్రమాల్లో భాగంగానే మహిళా, దివ్యాంగ పోలింగ్ కేంద్రాలు, యూత్ మేనేజ్‌డ్ పోలింగ్ కేంద్రాలతోపాటు మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు గుర్తించాం. ఎన్నికలు జరిగే ఒక్క రోజు ముందు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఓటర్లను ఆకర్షించేలా ముస్తాబు చేస్తాం. వంద శాతం ఓటింగ్ నమోదుకు కృషి చేస్తాం.

– రాములు, మంచిర్యాల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో

సుమన్‌కు సుడిగుండమే!

- నియోజకవర్గంలో ఎమ్మెల్యేపై వ్యతిరేకత
- చేసిన అభివృద్ధి చెప్పినా కనిపించని మైలేజీ
- 'చెన్నూరు' ఆయన పట్టుతప్పుతోందా?
- ఎన్నికల వేళ గులాబీ శ్రేణుల్లో గుబులు



బాల్క సుమన్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: చెన్నూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌కు ఈ ఎన్నికలు సుడిగుండంలా మారాయి. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌కు కొడుకులాంటి వాడినని చెప్పుకునే ఈ విద్యార్థి నాయకుడికి నియోజకవర్గంలో తన పట్టు తప్పుతోందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ ఆశించిన మైలేజీ రాక సొంత పార్టీలోనే విస్మయం కలిగిస్తోంది. 2014 ఎన్నికల్లో పెద్దపల్లి లోక్‌సభ స్థానం నుంచి అప్పటి సిట్టింగ్ ఎంపీ, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ చెన్నూర్ అభ్యర్థి వివేక్‌పై అనూహ్యంగా గెలవడంతో సుమన్ ప్రజాప్రాతినిధ్య జీవితానికి తొలి అడుగు పడింది. 2018 ఎన్నికల్లో చెన్నూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే నల్లాల ఓదెలును కాదని ఎంపీగా ఉన్న సుమన్‌కు టికెట్ ఇచ్చారు. ఆ సమయంలో టికెట్‌పై పెట్రోల్ 'మంటల' మధ్యలోనే ఎన్నికలు ఎదుర్కొన్నారు. చివరికి అప్పటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఎంపీ వెంకటేష్‌నేతపై 28వేల ఓట్ల తేడాతో గెలిచారు. ప్రస్తుతం రెండోసారి చెన్నూర్ టికెట్ దక్కించుకుని బరిలో ఉన్నారు.

అభివృద్ధి చెప్పినా.. వ్యతిరేకతేనా?

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలతో పోలిస్తే చెన్నూర్‌లోనే ఎక్కువ అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే సుమన్, పార్టీ శ్రేణులు చెబుతుంటారు. ప్రత్యేక బుక్‌లెట్ వేసి మరీ ప్రచారం చేస్తున్నా వ్యతిరేకతే వ్యక్తమవుతోంది. ప్రచారం మొదలైన తొలి రోజు నుంచే ఓటర్లు తిరగబడుతున్నారు. ఆర్కేపీ, ఊరు మందమర్రి, చెన్నూరు, గంగారంలో నిరసనలు ఎదురయ్యాయి. చిత్రంగా మందమర్రి, ఆర్కేపీ, చెన్నూరు ఈ మూడు పట్టణాలకు రెండు వందల కోట్ల చొప్పున నిధులు తెచ్చామని చెప్పినా ఆ మేరకు ఓట్లు రాలుతాయా? అంటే చెప్పలేని పరిస్థితి. సుమన్ ప్రజలకు అందుబాటులో లేక, ఆయన పేరు చెప్పి నియోజకవర్గంలో కొందరు నాయకుల దందాలే కొంపముంచే పరిస్థితికి తెచ్చాయని అంటున్నారు. కోటపల్లి పరిధిలో ఓ నాయకుడు చేస్తున్న భూ కబ్జాలు, బెదిరింపులు, మద్యం దందాలు, సెటిల్‌మెంట్లు అక్కడి ఓట్లపై దెబ్బ పడుతున్నాయి. ఇక మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ వర్గీయులను పక్కకు పెట్టి, కేసులు పెట్టించడంతో వారంతా దెబ్బకొట్టేందుకు రెడీ అయ్యారు. ఎమ్మెల్యే రెండో సెట్ నామినేషన్ వేసే సందర్భంలో ఎమ్మెల్సీని బతిమాలినా రాకపోతే, చివరకు పార్టీ హైకమాండ్‌తో చెప్పించుకోవల్సిన పరిస్థితి ఉందంటే అర్థం చేసుకోవచ్చు. సొంత నియోజకవర్గ సీనియర్ నాయకుడినే ఆయన లెక్క చేయకపోగా కార్యకర్తలు, నాయకులకు ఫోన్‌లోనైనా అందుబాటులో ఉండరనే అపవాదు సామాన్య కార్యకర్తల్లో ఉంది. మందమర్రి, ఆర్కేపీలో సింగరేణి క్వార్టర్లు, భూములు ఎమ్మెల్యే అనుచరుల కబ్జాలు, ఆయన పేరు చెప్పి అక్రమాలకు పాల్పడడంతో వందల కోట్ల అభివృద్ధి ఈ వ్యతిరేకత ముందు నిలవడం లేదు.

తప్పని 'మందమర్రి' గండం

నియోజకవర్గం మొత్తం 1.88లక్షల ఓట్లలో మందమర్రి పరిధిలోనే 76వేల వరకు ఉన్నారు. ఇక్కడ ఏజెన్సీ వివాదంతో ఎన్నికలు జరగక అభివృద్ధికి అడ్డుగా మారింది. గత ఎన్నికల్లో, ఈ ఎన్నికల్లోనూ సీఎం కేసీఆర్ మందమర్రి సభల్లో ఇచ్చిన హామీలు పరిష్కారానికి నోచలేదు. సింగరేణి స్థలాల్లో కొందరికి ఇళ్ల పట్టాలు, దళితబంధు రాక, నిత్యం ఇబ్బంది పెడుతున్న ఆర్కేపీ రైల్వే ఫ్లైఓవర్ జాప్యం వెరసి వ్యతిరేకతకు కారణంగా మారాయి. జైపూర్, భీమారం, చెన్నూరు, కోటపల్లి మండలాల్లో సొంత పార్టీ నాయకులే ప్రత్యర్థి వైపు చూడడం మరింత ఇబ్బంది పెట్టే అంశాలు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టుతో చెన్నూరు, కోటపల్లి, జైపూర్ మండలాల్లోని రైతుల పంట నీట ము నగడం, ఇసుక క్వారీల్లో అక్రమాలు, స్థానిక ఇ బ్బందులు ఓటర్లపై ప్రభావం చూపుతున్నా యి. కొత్తగా చేపట్టబోతున్న చెన్నూరు ఎత్తిపోతల పథకంలో భూ నిర్వాసితులకు పరిహా రం మార్కెట్ విలువకంటే తక్కువ ఉండడంతో రైతులు అసంతృప్తితో ఉన్నారు. జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్, సింగరేణి కార్మికవర్గాల్లోనూ సర్కారుపై వ్యతి రేకత ఉంది. ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు సుమన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ సుడిగుండాలను ఆయన ఎలా ఎదుర్కొని నిలుస్తారనేది జిల్లా రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

బైండోవర్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

బెల్లంపల్లి: నేరచరితులు బైండోవర్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని నేరచరితులు, రౌడీషీటర్లు, అక్రమంగా మద్యం విక్రయించే, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ముందస్తుగా తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. బైండోవర్ అయిన వ్యక్తులు ఆరు నెలలపాటు నిబంధనలు పాటిస్తామని, అతిక్రమించబోమని సొంత పూచీకత్తు సమర్పించారని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. పోలీసు నిఘా కొనసాగుతోందని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

28న ఉమెన్స్ కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

శ్రీరాంపూర్: ఉమెన్స్ కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 28న శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఈ రామచందర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు, రూ.100 ఎంట్రీ ఫీజుతో ఉదయం 10 గంటలకు మైదానం వద్ద నుంచి వెళ్లి పీఈటీ సదానందంకు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఇందులో ఎంపికైన జిల్లా జట్టు డిసెంబర్ 4నుంచి 7వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగే 70వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9849124856 9963719719 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థిని ప్రతిభ


రితిక

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ట్రినిటి పాఠశాల విద్యార్థిని రితిక అథ్లెటిక్స్ పోటీలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల డైరెక్టర్ డోమినిక్, ప్రిన్సిపాల్ జోసెఫ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చెన్నూర్ పట్టణంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ 200 మీటర్ల పరుగుపందెంలో రితిక ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో రితిక పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా రితికను ఉపాధ్యాయులు అభినందించినట్లు వివరించారు.

ఇరువర్గాలపై కేసు

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బెల్లంపల్లి పట్టణంలో నిబంధనలు అతిక్రమించి సోషల్‌మీడియాలో ఒకరికొకరు కించపరిచే పోస్టులు పెట్టుకున్న రెండు ప్రధాన పార్టీలకు చెందిన నాయకులపై కేసులు నమోదు చేసినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. గురువారం ఇరు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సోషల్ మీడియాలో పరస్పరం కించపరుచుకునేలా అసభ్యకరమైన పోస్టులు పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన గోలి శివ, మిట్ట వెంకటేశ్, గట్టు సందీప్‌గౌడ్‌తో పాటు వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు


సుందర్ (ఫైల్)

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని భట్‌పల్లి గ్రామానికి చెందిన కామిటి సుందర్ (22) అనే యువకుడు అదృశ్యమైనట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సుందర్ గురువారం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు బంధువులు, మిత్రుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నీరు నిల్వకుండా చూడాలి

మంచిర్యాలటౌన్: రోజులతరబడి నీరు నిల్వలేకుండా చూడాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అనిత సూచించారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను శుక్రవారం సందర్శించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి విద్యార్థినులకు వివరించారు. పాఠశాల ఆవరణలో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. నిల్వ నీటిని వైద్య సిబ్బందితో తొలగించారు. వ్యాధులు, రకాలు, కారకాలు, చికిత్స విధానం, ముందుజాగ్రత్త చర్యల గురించి వివరించారు.

ఓటేస్తాం.. ప్రశ్నిస్తాం

- ఓటు సామాన్యుడి వజ్రాయుధం
- సమర్థవంతులకే ఓటేసుకుందాం
- మంచి సర్కార్‌ను తెచ్చుకుందాం
- సాక్షి 'ప్రజాఎజెండా'లో మహిళలు

ప్రజా ఎజెండా



మంచిర్యాలటౌన్: ప్రభుత్వాలు మాకు ఇది చేయడం లేదు.. అది చేయడం లేదు.. అని నిందించడం సరికాదు. ఎందుకంటే ఆయా ప్రభుత్వాలను ఎన్నుకునేది మనం వేసే ఓటే. అందుకే ఎన్నికలు వచ్చినప్పుడు ఓటు వినియోగించుకోకుండా ఉండొద్దు. ఎక్కడున్నా, ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలి. ఓటు వేసే ముందు ఒక్కసారి ఆలోచించాలి. సమర్థవంతుడైన అభ్యర్థికే ఓటేసి మంచి సర్కార్ ఏర్పాటుకు సహకరించాలి. కాగా, తామంతా ఓటేస్తామని, ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా ఆదర్శంగా నిలుస్తామని పలువురు మహిళలు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ నెల 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొని ఓటు వినియోగించుకోవాలని కోరుతున్నారు. నేతలు ఎలా ఉండాలని.. పలువురు మహిళలు, యువతుల వెలిబుచ్చిన అభిప్రాయాలు వారి మాటల్లో..

బాధ్యతగా ఓటేయాలి



ఓటు వినియోగించుకోకపోతే మనం బాధ్యతారహితంగా ఉన్నట్టు. సమాజ అభివృద్ధిని కాంక్షించే వారిని, సమాజంలో మార్పు తెచ్చే వారికి ఓటేయాలి. మహిళలపై దాడులు చేసేవారికి వెంటనే కఠిన శిక్షలు అమలు చేసేలా చూసే నాయకులకు ఓటేయాలి. మహిళాభ్యుదయానికి పాల్పడే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి.

– జ్యోత్స్న చంద్రదత్, ఇంపాక్ట్ స్పీకర్, మంచిర్యాల

ప్రశ్నించే హక్కు కోల్పోవద్దు



మహిళలు ఎందులోనూ తక్కువ కాదని, అన్ని రంగాల్లో ముందుంటారని నిరూపించుకోవాలి. లింగ వివక్ష లేకుండా పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించే వారికి ఓటేయాలి. మహిళా చట్టాలను గౌరవించేవారిని ఎన్నుకోవాలి. ప్రతీ మహిళ ఓటేసి పాలకులను ప్రశ్నించే హక్కును కాపాడుకోవాలి.

– కె.ఉషశ్విని, వనితావాక్కు జిల్లా ఉపాధ్యక్షురాలు

ప్రజల మధ్య ఉండేవారికే..



ఓటు మన హక్కుగా భావించాలి. సమాజంపై అవగాహన, సమస్యలపై స్పష్టత ఉన్న నాయకులను గుర్తించాలి. గెలిచిన తరువాత సమస్యల పరిష్కారం దిశగా కృషి చేసే వారికే ఓటేయాలి. నిత్యం ప్రజల మధ్య ఉండి.. ప్రజాసమస్యలు తెలుసుకునే మంచి నాయకుడిని ఎన్నుకోవాలి. అందరూ ఓటు సద్వినియోగం చేసుకోవాలి.

– సునీత, ఉపాధ్యాయురాలు, మంచిర్యాల

ఆలోచించి ఓటేయాలి



మహిళల భద్రతకు ఉపయోగపడే చట్టాలు ఎన్ని రూపొందించినా, వాటిని సమర్థవంతంగా అమలు చేసే నాయకులు కావాలి. సమాజంలో మహిళలపై జరుగుతున్న లైంగికదాడులు, వరకట్న వేధింపులను అరికట్టే అభ్యర్థులను గుర్తించాలి. మహిళల రక్షణకు కృషి చేసే నాయకులను గుర్తించి వారికే ఓటేయాలి.

– శ్రీదేవి, ఉపాధ్యాయురాలు, మంచిర్యాల

నాకెందుకులే అనే భావనొద్దు



ఓటు వజ్రాయుధం లాంటిది. ఓటు వేయడంలో కొందరు ఆసక్తి చూపించరు. నాకెందుకులే అనే భావనతో ఉంటారు. ఈ పద్ధతి వీడాలి. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటు వేయాలి. ఓటు మనకు రాజ్యాంగం కల్పించిన హక్కు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా బాధ్యతగా ఓటు వేసేందుకు ముందుకు రావాలి.

– రవళి, విద్యుత్‌శాఖ ఏఈ, మంచిర్యాల

భవిష్యత్ బాగుంటుంది



ప్రతీ ఎన్నికల్లో ఓటున్న ప్రతి ఒక్కరూ విధిగా దానిని వినియోగించుకోవాలి. అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడేవారిని ఎన్నుకుంటే భవిష్యత్ బాగుంటుంది. మన ఓటు ఎంత కీలకమంటే.. మనకు కావాల్సిన వాటిని మనం అడిగే హక్కు కల్పిస్తుంది. నేతలను ప్రశ్నించే అవకాశం దక్కుతుంది.

– మంజుల, ఉపాధ్యాయురాలు, మంచిర్యాల

భవిష్యత్ తరాలకోసమైనా..



మహిళలు వారి హక్కుల కోసం ఎప్పుడూ పోరాడుతూనే ఉంటారు. అలాంటిది 18 ఏళ్లు నిండిన వారికి కల్పించిన ఓటును మనం సద్వినియోగం చేసుకోవాలి. మహిళల భద్రతకు కృషి చేసేవారిని గుర్తించాలి. అప్పుడే మహిళల హక్కుల గురించి మనం మాట్లాడేందుకు అవకాశం ఉంటుంది. తప్పనిసరిగా మన భవిష్యత్ తరాల కోసమైనా ఓటు వేయాలి.

– మణిమాల, యోగా టీచర్, మంచిర్యాల

ఎలాగైనా ఓటర్లను కలవాలని

- అసెంబ్లీ అభ్యర్థుల పాట్లు

మంచిర్యాలఅర్బన్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమీపిస్తుండగా వీలైనంత ఎక్కువ మంది ఓటర్లను కలిసేందుకు అభ్యర్థులు నానా పాట్లు పడుతున్నారు. సభలు, సమావేశాలే కాకుండా ఏ వేదిక దొరికినా ఓటర్లను కలవడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. ఈ వారంలో అన్నీ మంచిరోజులే ఉన్నాయి. పిలిచినా సరే.. పిలవకున్నా సరే.. శుభకార్యాలు, వివిధ ప్రారంభోత్సవాల వద్దకు వెళ్తున్నారు. ఓటర్లను పలకరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

కేజీబీవీ సందర్శన

తాండూర్: మండల కేంద్రంలోని కేజీబీవీని శుక్రవారం ప్యానల్ టీమ్ సభ్యులు సందర్శించారు. భోజనం, హాస్టల్ నిర్వహణ, తరగతి గదులను పరిశీలించారు. సీసీఈ రికార్డులు, నైట్ డ్యూటీ రిజిస్టర్, ల్యాబ్ రిజిస్టర్, ల్యాబ్ ఎక్విప్‌మెంట్, లైబ్రరీ టీచర్స్ రికార్డులు, అటెండెన్స్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. విద్యాలయంలో చేపట్టిన సివిల్ పనులపై ఆరా తీశారు. టీమ్ లీడర్ సత్యనారాయణ, సభ్యులు సుజాత, రమేశ్, మహేశ్వర్, రాజు, చైతన్యప్రవంతి, మాణిక్, రాజయ్య, శాంకరి, మమత, కనకలక్ష్మి, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్


సృజనాదేవి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సృజనాదేవికి డాక్టరేట్ లభించింది. శాతవాహన యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగ పరిశోధకురాలు సృజనాదేవికి శుక్రవారం విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ డాక్టరేట్ ప్రకటించారు. ఆమె 'ఏ స్టడీ ఆన్ వర్క్ లైఫ్ బ్యాలెన్స్ ఆఫ్ ఎంప్లాయిస్ ఇన్ బ్యాంకింగ్ సెక్టార్ విత్ రిఫరెన్స్ టు (ఎస్‌బీఐ, హెడీఎఫ్‌సీ) బ్యాంక్ ఇన్ తెలంగాణ' అనే అంశాన్ని పూర్తి చేసింది. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అతిరథులొస్తున్నారు

- నేడు ఆదిలాబాద్‌కు రాహుల్.. సిర్పూర్‌కు యోగి రాక
- రేపు నిర్మల్‌కు ప్రధాని మోదీ.. ఖానాపూర్‌కు సీఎం కేసీఆర్
- త్వరలో మంచిర్యాలకు అమిత్‌షా..


ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రాహుల్‌గాంధీ సభ కోసం ఏర్పాటు చేసిన వేదిక

సాక్షి, ఆదిలాబాద్: అతిరథ మహారథులు వస్తున్నారు. ఎన్నికల ప్రచారం తుది అంకానికి చేరుకోగా, జాతీయ నేతలు వరుసపెట్టి వస్తున్నారు. శనివారం ఆదిలాబాద్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వస్తున్నారు. సిర్పూర్ కాగజ్‌నగర్‌కు బీజేపీ తరఫున ప్రచారం చేసేందుకు ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వస్తున్నారు. ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్మల్ పర్యటన ఖరారైంది. ఇదేరోజు సీఎం కేసీఆర్ ఖానాపూర్‌లో పర్యటిస్తున్నారు. ఒకేరోజు నిర్మల్ జిల్లాలో అటు ప్రధాని, ఇటు సీఎం పర్యటనలు ఉండటం గమనార్హం. దీంతో బందోబస్తు చర్యలు చేపట్టడం పోలీసులకు సవాల్‌గా మారింది.

కేసీఆర్ పది నియోజకవర్గాల్లో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటనలు సంపూర్ణం కానున్నాయి. ఆదివారం ఖానాపూర్ సభ పూర్తయితే పది నియోజకవర్గాల్లో ఆయన పర్యటించినట్లు అవుతుంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఉమ్మడి జిల్లాలో సగం నియోజకవర్గాల్లో తిరిగారు. బెల్లంపల్లి, ఖానాపూర్, ఆదిలాబాద్, నిర్మల్, బోథ్‌లో ఇప్పటివరకు ఆయన పర్యటనలు పూర్తయ్యాయి. మిగతా రోజుల్లో మరికొన్ని నియోజకవర్గాల్లో ఆయన పర్యటించే అవకాశాలున్నాయి. మంచిర్యాలలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యటన ఉంటుందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఇటీవలే కాంగ్రెస్ నేత ప్రియాంకాగాంధీ ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో బహిరంగ సభల్లో పాల్గొన్నారు.

మరికొంత మంది నేతలు..

ఎన్నికల పోలింగ్ 30వ తేదీన ఉండగా, 48 గంటల ముందుగా ప్రచార పర్వం ముగుస్తుంది. 27న సాయంత్రంతో పార్టీల ప్రచారం పూర్తి కానుంది. అంతలోపే జాతీయ, రాష్ట్ర నేతలు విస్తృతంగా ఉమ్మడి జిల్లాలో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఖానాపూర్ రోడ్‌షోలో త్వరలో పాల్గొననున్నారు. మహారాష్ట్ర సీఎం ఏకనాథ్ షిండే బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారంలో భాగంగా జిల్లాలో ఒకట్రెండు రోజుల్లో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. బీజేపీ పరంగా ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉమ్మడి జిల్లాలో పర్యటించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

అంకెలు దిద్దిన అధికారుల మెడకు ఉచ్చు

- విచారణ చేపట్టిన అధికారులు
- సాక్ష్యాలు ఇచ్చిన ఫిర్యాదుదారు

బెల్లంపల్లి: నియోజకవర్గ ఎన్నికల ప్రచార లెక్కల్లో అవకతవకలకు పాల్పడిన మున్సిపల్ అధికారులపై క్రమంగా ఉచ్చు బిగుస్తోంది. మున్సిపల్ రశీదుపై అంకెలు దిద్ది అక్రమాలకు పాల్పడిన కమిషనర్‌పై కొందరు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఇటీవల చేసిన ఫిర్యాదు మేరకు గురువారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో అధికారులు విచారణ చేపట్టారు. విచారణ అధికారులు ఫిర్యాదుదారులతో ప్రత్యేకంగా మాట్లాడి తగిన ఆధారాలు సేకరించారు. ప్రచార అనుమతి కోసం కాంగ్రెస్ నుంచి రూ.15 వేలు తీసుకుని మున్సిపల్ అధికారులు ఇచ్చిన అంతర్గత రశీదుపై ఓ అంకెను చెరిపేసి ఏకంగా పచ్చ ఇంకుతో కమిషనర్ రూ.10వేలు మాత్రమే రాసి సంతకం చేసి అడ్డంగా దొరికిపోయాడు. ఈ వైనాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. అక్రమ వ్యవహారం బయట పడగా కొందరు సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎట్టకేలకు విచారణ చేపట్టారు. విచారణ నివేదిక రెండురోజుల వ్యవధిలో ఉన్నతాధికారులకు అందజేస్తామని ఫిర్యాదుదారుకు అధికారులు చెప్పినట్లుగా తెలుస్తోంది. ఆ తర్వాత బాధ్యులపై తదుపరి చర్యలు తీసుకోవడం తథ్యమనే ప్రచారం జరుగుతోంది. కాగా, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ముందస్తుగా జిల్లా, బెల్లంపల్లి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించినట్లు ఫిర్యాదుదారులు ఆరోపించారు. తప్పు చేసిన అధికారిని కాపాడటానికే ఆ తీరుగా వ్యవహరించి ఉంటారని చర్చించుకుంటున్నారు.

కర్త, కర్మ, క్రియ అంతా ఆయనే..!

అంకెల లెక్కల తప్పుడు వ్యవహారంలో మున్సిపల్ కమిషనర్ అడ్డంగా బుక్కయ్యారు. అన్నీ తెలిసీ కమిషనర్ ఉద్దేశపూర్వకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఎన్నికల వేళ నిక్కచ్చిగా వ్యవహరించాల్సిన అవసరం ఉండగా తప్పుడు పద్ధతి పాటించి ఆ తప్పిదాన్ని నెత్తిన వేసుకోవాలని ఒకరిద్దరు సిబ్బందిపై ఒత్తిళ్లు తీసుకువస్తున్నట్లు మున్సిపల్ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, చేయని నేరాన్ని తామెలా నెత్తిన వేసుకుంటామని సిబ్బంది బాహాటంగానే చెబుతున్నారు. కమిషనర్ తమకన్నా ఉన్నతాధికారి కావడంతో ఏ చిన్న తప్పు దొర్లినా టార్గెట్ చేస్తారేమోనని భయపడుతున్నారు.

ఏసీబీ వలలో చింతలమానెపల్లి ఎస్సై

- రూ.20వేల లంచం కోసం వేధింపులు
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు

చింతలమానెపల్లి(సిర్పూర్): లంచం కోసం యువకుడిని వేధించిన చింతలమానెపల్లి ఎస్సై ఏసీబీకి పట్టుబడటం స్థానికంగా కలకలం సృష్టించింది. కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి మండల ఎస్సై ఎస్.వెంకటేశ్, హోంగార్డ్ జనార్దన్ శుక్రవారం లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఏసీబీ డీఎస్పీ రమణామూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానెపల్లి మండలం దిందా గ్రామానికి చెందిన ఓ వివాహిత కుటుంబ కలహాలతో గత నెల 2న ఇంటి నుంచి వెళ్లిపోయింది. మహారాష్ట్రలోని అహేరి పట్టణానికి ఆమె వెళ్లేందుకు దిందా గ్రామానికి చెందిన యువకుడు డోకె ప్రశాంత్ సహకరించాడు. పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు కాగా.. కొద్దిరోజుల అనంతరం సదరు వివాహిత ఇంటికి తిరిగి వచ్చింది. ఈ ఘటనలో రూ.70వేల లంచం ఇవ్వాలని ప్రశాంత్‌ను ఎస్సై వెంకటేశ్ వేధించాడు. అడిగినంత ఇవ్వకుంటే కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తానని బెదిరించాడు. బేరసారాల మధ్య ప్రశాంత్ రూ.20వేలు ఇచ్చేందుకు అంగీకరించాడు. అయితే లంచం ఇవ్వలేని పరిస్థితిలో ఉన్న ప్రశాంత్ గత్యంతరం లేక ఏసీబీని ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వల వేసి ఎస్సైని పట్టుకున్నామని డీఎస్పీ వెల్లడించారు. ఎస్సై డిమాండ్ చేసిన నగదును మధ్యవర్తి డోకె శ్రీనివాస్ చింతలమానెపల్లి మండల కేంద్రంలోని ఓ ఇంటి వద్ద హోంగార్డు జనార్దన్‌కు ఇస్తుండగా పట్టుకున్నామని డీఎస్పీ తెలిపారు. పూర్తి వివరాలు సేకరించి ఎస్సై వెంకటేశ్, హోంగార్డు జనార్దన్‌ను శనివారం ఏసీబీ కోర్టులో ప్రవేశపెడతామని ఆయన పేర్కొన్నారు. లంచం కోసం ఎవరైనా వేధిస్తే ఏసీబీని 9154388963 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు. ఈ దాడిలో ఎస్సైలు రాము, జాన్సన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న రమణమూర్తి


స్వాధీనం చేసుకున్న నగదు


ఎస్సై వెంకటేశ్

లైంగికదాడి కేసులో ఒకరికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్: బాలికపై లైంగికదాడికి పాల్పడ్డ కేసులో దహెగాం మండల కేంద్రానికి చెందిన పశువుల కాపరి నాయిని సత్తయ్యకు జీవిత ఖైదు, రూ.6వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, పోక్సో అక్ట్ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి పీవీ రమేశ్ శుక్రవారం తీర్పు చెప్పారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవీఎస్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. దహెగాం మండల కేంద్రానికి చెందిన నాయిని సత్తయ్య 2018 ఆగస్టు 15న గ్రామంలోని తన ఇంటి ఎదురుగా ఉండే ఏడేళ్ల బాలికకు స్నాక్స్ ప్యాకెట్ ఇచ్చి ఇంట్లోకి తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి దహెగాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదైంది. అప్పటి డీఎస్పీ సాంబయ్య కేసు దర్యాప్తు చేసి 16మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైతీర్పు చెప్పారు.

భీమారంలో జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు


క్రీడాకారులతో అధికారులు

భీమారం: స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. క్రీడలను ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పరిమళ, రిటైర్డ్ ఏసీపీ రవికుమార్ ప్రారంభించారు. 14, 17 ఏళ్ల బాల, బాలికలకు పోటీలు నిర్వహించడం అభినందనీయమని కార్యదర్శి పరిమళ పేర్కొన్నారు. చదువుతోపాటు క్రీడలపైనా విద్యార్థులు దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని చెప్పారు. జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందిన వారిని జోనల్ పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ విఠల్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్ర ధాన కా ర్యదర్శి శ్రీనివాస్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ప్రమాద స్థలిలో బస్సు కింద పడి ఉన్న బైక్

చింతలమానెపల్లి: మండలంలోని అడెపెల్లి గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని డబ్బా నుంచి కాగజ్‌నగర్ మార్గంలోని అటవీ ప్రాంతంలో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బెజ్జూర్ మండలం అర్కగూడ గ్రామానికి చెందిన అనసూయ అనే సీఆర్పీ, గోవర్దన్ అనే మరో సీఆర్పీకి గాయాలయ్యాయి. వీరిని 108లో కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఆర్టీసీ బస్సు కాగజ్‌నగర్ నుంచి డబ్బా వైపు వస్తుండగా డబ్బా నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్తున్న సీఆర్పీలు ప్రయాణిస్తున్న వాహనంతో ఢీకొట్టారు. ఈమేరకు చింతలమానెపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అకాల వర్షం.. ఆందోళనలో అన్నదాత


కోటపల్లి: ధాన్యం కుప్పలపై కవర్లు


జన్నారం: తడిసిన ధాన్యాన్ని చూస్తున్న నాయకులు


జైపూర్ మండలం కుందారంలో..

- కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు
- ఆరబోసుకుని రోజుల తరబడి నిరీక్షణ
- కొనుగోళ్లు ప్రారంభించక పడిగాపులు
- వర్షాలకు తడుస్తున్న ధాన్యం కుప్పలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉపరితల ఆవర్తనంతో రెండురోజులుగా జిల్లాలో మబ్బులు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం తెల్లవారుజామునుంచి చెన్నూర్, భీమారం, జైపూర్, నస్పూర్, హాజీపూర్, బెల్లంపల్లి మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తుండడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నెల ఆరంభం నుంచే వరి కోతలు మొదలు కాగా, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసుకుంటున్నారు. మబ్బులు కమ్ముకోగా ధాన్యం కుప్పలపై కవర్లు కప్పుకొన్నారు. కేంద్రాలు ప్రారంభించకపోవడం, టార్పాలిన్లు లేక అద్దెకు కవర్లు తీసుకువచ్చి ధాన్యాన్ని కాపాడుకుంటున్నారు. భారీ వర్షం వస్తే చేతికి వచ్చిన పంట నీటిపాలవుతుందని గుబులు చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరుతున్నారు.

జన్నారం మండలంలో..

జన్నారం: మండలంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షంతో వరి కుప్పలు తడిసిపోయాయి. ధాన్యం కేంద్రాల్లో ఆరబెట్టుకోగా అకాల వర్షంతో తడిసి ముద్దయింది. రైతులు ధాన్యం కుప్పలపై కవర్లు కప్పుకొన్నా వాటిపై వరద నీరు చేరింది. జన్నారం, కవ్వాల్, కామన్‌పల్లి, దేవునిగూడ, మొర్రిగూడ, పొనకల్, చింతగూడ తదితర గ్రామాల్లో వర్షంతో ధాన్యం తడిసిపోయింది. అధికారులు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

నెన్నెల మండలంలో..

నెన్నెల: మండలంలో శుక్రవారం తేలికపాటి వర్షం కురవడంతో అన్నదాతలు గుబులు చెందుతున్నారు. వరి ధాన్యం కుప్పలు తడవకుండా కవర్లు కప్పి కాపాడుకుంటున్నారు. కొందరు రైతులు హుటాహుటిన ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వర్షానికి తడిసిన పత్తి నల్లబడి గిట్టుబాటు ధర రాదని ఆవేదన చెందుతున్నారు.

చెన్నూర్ నియోజకవర్గంలో..

కోటపల్లి: చెన్నూర్ నియోజకవర్గంలోని చెన్నూర్, భీమారం, జైపూర్, మందమర్రి, కోటపల్లి మండలాల్లో చాలావరకు చేతికొచ్చిన పత్తి, వరి పంటలు నష్టపోయే అవకాశం ఉండటంతో రైతులకు ఏమి చేయాలో తోచడం లేదు. శుక్రవారం ఉదయం నుంచి జల్లులు ప్రారంభం కాగా, చేలలో ఉన్న పత్తితో పాటు సేకరించిన పత్తిని కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

చెన్నూర్‌రూరల్/జైపూర్: చెన్నూర్ మండలం ఎల్లక్కపేట, కిష్టంపేట, లింగంపల్లి, ఎర్రగుంటపల్లి, సుందరసాల, కొమ్మెర, అస్నాద, పొక్కూరు తదితర గ్రామాల్లో కోతకు వచ్చిన వరి నేలవాలుతుందని రైతులు గుబులు చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం ఆరబోసి ఉండటం, ఓ పక్క వర్ష సూచన ఉండటంతో ఆందోళనకు గురవుతున్నారు. జైపూర్ మండలంలోని పవర్ ప్లాంట్ పొగమంచుతో కమ్ముకుంది. మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై పొగమంచు కమ్ముకోగా వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. పంటలు చేతికందే సమయంలో కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.